సాక్షి నిజామాబాద్

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



'కూలీ'లకు ఈకేవైసీ హాజరు

ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- IIలో ▸



మన చేతుల్లోనే ఆరోగ్యం

ప్రతిఒక్కరూ భోజనం తినడానికి ముందు, బాత్‌రూమ్ వెళ్లివచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఎంతో మేలు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /20.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం వేళ చల్లనిగాలులు వీస్తాయి. కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో సీపీఆర్‌పై అవగాహన



నిజామాబాద్‌నాగారం : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీపీఆర్‌పై నర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ ఇతర సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 17 వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవంలో భాగంగా ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమాన్ని జీజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ జలగం తిరుపతి రావు మార్గదర్శనం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ ప్రత్యూషలు హార్ట్ స్ట్రోక్ వచ్చినప్పుడు ఏవిధంగా సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చో అర్థం అయ్యేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ డిపార్టుమెంట్ డాక్టర్ విజయ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ చంద్రకళ, 180 మందికి పైగా పాల్గొన్నారు.

వైన్ షాపులకు 30 దరఖాస్తులు

నిజామాబాద్‌అర్బన్ : మద్యం షాపులకు మంగళవారం 30 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని102 వైన్ షాపులకు ఇప్పటివరకు 262 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లాలోని ఆవులు, గేదెలు, దూడలు, లేగలకు ఈనెల 15 నుంచి నవంబర్ 14 వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశువైద్య, పశు సంవర్ధకశాఖ అధికారి రోహిత్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ఏడీ గంగాధరయ్యతో కలిసి రోహిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో 1.97లక్షల ఆవులు, గేదెలు, దూడలు, లేగలు ఉన్నాయని తెలిపారు. ఏడో విడతలో భాగంగా నేటి నుంచి నెల రోజుల పాటు గ్రామాల్లో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేస్తారని పేర్కొన్నారు. వీసీలో మండల పశు వైద్యాధికారి శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా సుమంత్

- గ్రూప్–1 ద్వారా ఎంపిక



నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా సుమంత్ రానున్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1 ద్వారా ఎంపికయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖలో శిక్షణ పొందుతున్నారు. ఇతని స్వస్థలం మాక్లూర్ మండలంలోని మాదాపూర్ గ్రామం. ఖమ్మంలో జిల్లాలో నివాసం ఉంటున్నారు. నేడో, రేపో విధుల్లో చేరే అవకాశం ఉంది.

రేషన్ కార్డుల్లో భారీ అక్రమాలు

చర్యలు శూన్యం!

- భారీ వసూళ్లు.. అనర్హులకు రేషన్ కార్డుల జారీ
- అక్రమార్కుల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది
- 'మీసేవ' కేంద్రాల నిర్వాహకుల ప్రధాన భూమిక
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆగ్రహం
- విచారణ పూర్తి చేసిన జిల్లా అధికారులు

జిల్లాలో రేషన్ కార్డుల జారీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశించినా తగిన ఫలితం కనిపించడం లేదు. రేషన్ కార్డుల జారీలో కొన్ని మండలాల్లో అనర్హులను ఎంపిక చేశారు. అక్రమాలకు పాల్పడిన అధికారులు, సిబ్బంది పేర్లు, ఎవరు ఎంతెంత వసూలు చేశారనే వివరాలతో కమిషనర్ జిల్లా అధికారులకు జాబితాను పంపినట్లు తెలుస్తోంది. విచారణ జరిపిన అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారు.



నిజామాబాద్‌అర్బన్ : ప్రజాపాలన కింద నూతన రేషన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే 3,83,384 రేషన్ కార్డులు ఉన్నాయి. కొత్తగా మంజూరైన రేషన్ కార్డుల్లో లక్షా 18 వేల మంది పేర్లు చేరాయి. ఇదిలా ఉండగా అనర్హులకు సైతం రేషన్ కార్డులు దక్కినట్లు పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందులో కొందరు అధికారులు, రెవెన్యూ సిబ్బంది భారీగా వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లగా ఆయన అక్రమార్కుల జాబితాను జిల్లాకు పంపి విచారణ కోసం ఆదేశించినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం.. అధికారులు దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి రేషన్ కార్డు మంజూరు చేయాలి. అదేవిధంగా రేషన్‌కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలి. ఈ ప్రక్రియ మూడు నెలల పాటు కొనసాగింది.

ఇదే అదునుగా భావించిన కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది భారీగా వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఏ మాత్రం అర్హత లేని వారికి రేషన్ కార్డులు మంజూరు చేశారని సమాచారం. నూతనంగా రేషన్ కార్డు పొందడం కోసం ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.10 వేల నుంచి రూ. 15 వేల వరకు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇందులో 'మీ సేవ' కేంద్రాల నిర్వాహకులు ప్రధాన భూమిక పోషించారు. మీ సేవ కేంద్రాలకు వచ్చే అనర్హులైన దరఖాస్తుదారుల నుంచి రేషన్ కార్డులు మంజూరు చేయిస్తామని చెప్పి వసూళ్లకు పాల్పడ్డారు. దరఖాస్తుదారులను తహసీల్ కార్యాలయాలకు తీసుకెళ్లి భరోసా ఇప్పించారు. ఈ క్రమంలో జరిపిన వసూళ్లలో రెవెన్యూ సిబ్బందికి వాటాలు పంచినట్లు తెలుస్తోంది.

జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ సౌత్ మండలం తహసీల్ కార్యాలయంలో అత్యధిక అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో పని చేసే ఉద్యోగి ఏకంగా 34 మంది నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు అధికారులు విచారణలో తేలింది. అదేవిధంగా జిల్లా కేంద్రంలో మూడు మీ సేవా కేంద్రాలను, ధర్పల్లి, సిరికొండ, రెంజల్, ఎడపల్లి, నవీపేట మండల కేంద్రాల్లోని మీసేవ కేంద్రాలు అక్రమాలకు అడ్డాగా గుర్తించారు. వీటిపై విచారణ పూర్తయ్యింది. బాల్కొండ, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లోని రెవెన్యూ సిబ్బంది భారీ మొత్తంలో వసూలు చేశారని తెలిసింది. నిజామాబాద్ అర్బన్‌లో బోగస్ రేషన్ కార్డుల జారీ ఎక్కువగా జరిగినట్లు అధికారులు గుర్తించారు. జిల్లా కేంద్రంలో పని చేసే ఓ ప్రభుత్వ ఉద్యోగి ఏకంగా రూ. 20 వేలు ఇచ్చి సౌత్ మండలంలో మూడు రేషన్ కార్డులు పొందినట్లు తెలుస్తోంది. గాంధీ చౌక్‌లోని వ్యాపార నిర్వాకుడు, వినాయక నగర్‌లోని పెట్రోల్ బంక్ యజమాని, బోధన్ రోడ్డులోని ఓ ప్రైవేట్ పాఠశాల యజమాని రేషన్ కార్డులు పొందినట్లు అధికారుల అధికారులు గుర్తించారు.

పది మండలాల్లో..

జిల్లాలోని పది మండలాల్లో 22 మంది రెవెన్యూ సిబ్బంది, అధికారులు రేషన్ కార్డుల జారీలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణ అధికారులు తేల్చారు. దరఖాస్తుదారుడు రేషన్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోగానే మండల కార్యాలయంలోని సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. రేషన్ కార్డుకు అర్హతలు గుర్తించి కార్డు మంజూరు కోసం పౌరసరఫరాల శాఖకు సిఫార్సు చేయాలి. ఈ క్రమంలోనే రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ పేరిట దరఖాస్తుదారుడు అనర్హుడు అయితే డబ్బులు వసూలు చేసి అర్హుడిగా సిఫార్సు చేశారు. ఇలా వందలాది మంది అనర్హులకు రేషన్ కార్డులు జారీ చేశారు. మండల కార్యాలయంలో పని చేసే కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మరికొందరు తహసీల్దారులు కూడా ఈ అక్రమాల్లో భాగస్వాములైనట్లు తెలుస్తోంది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నెల రోజుల క్రితమే అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ పూర్తయ్యింది. అక్రమార్కులకు గుర్తించారు. అయితే అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో మీనవేషాలు లెక్కిస్తున్నారు. దీని వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లు సమాచారం.



బోధన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు రిజ్వాన్ అర్షద్, వేదికపై ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

క్షేత్రస్థాయి నుంచి జల్లెడ

- డీసీసీ అధ్యక్షుడి ఎంపికలో ఒకటో ప్రాధాన్యత.. రెండో ప్రాధాన్యత
- పకడ్బందీగా అభిప్రాయ సేకరణ చేస్తున్న ఏఐసీసీ పరిశీలకుడు
- సెగ్మెంట్లవారీగా మారుతున్న సమీకరణలపై విశ్లేషణ
- గత ఐదేళ్ల కాలాన్ని కటాఫ్‌గా పెట్టిన నాయకత్వం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ షురువైంది. ఈ పీఠాన్ని బీసీకి అప్పగిస్తారా.. ఓసీకి కేటాయిస్తారా అనే విషయమై కచ్చితమైన నిర్ణయానికి రాకపోయినప్పటికీ ఏఐసీసీ నుంచి వచ్చిన పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ ప్రతి అంశాన్ని జల్లెడ పడుతున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయి నుంచి కచ్చితమైన అభిప్రాయాలను సేకరించేందుకు స్వయంగా ఆయా నియోజకవర్గాల్లోని బ్లాక్‌ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమావేశాలను సాధారణంగానే నిర్వహిస్తుండగా, ఆయా నియోజకవర్గంలోని కీలక నేతల, సీనియర్ నాయకుల, బ్లాక్, మండలాల అధ్యక్షుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఇందుకు గాను వ్యక్తిగతంగా ఒక్కొక్కరితో మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత వివరాలు తీసుకుంటున్నారు. ఇందులో సామాజిక సమీకరణలను సైతం బేరీజు వేస్తున్నారు. అభిప్రాయ సేకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు పార్టీ నాయకత్వం నిర్ణయించింది. దీంతో పీఠం ఆశిస్తున్న నాయకులు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి పరిశీలకుడు వడపోత కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఆయా నియోజకవర్గాన్ని బట్టి ప్రాధాన్యతాక్రమాలు మారుతున్నాయి. దీంతో డీసీసీ కోసం దరఖాస్తు చేసుకున్న నాయకులు తమ సొంత నియోజకవర్గం నుంచి భారీగా మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పరిశీలకుడికి తమ పేర్లు చెప్పాలంటూ శ్రేణులను కోరుతున్నారు. మరోవైపు ఐదేళ్ల ముందు నుంచి పార్టీలో పనిచేస్తున్నవారికే డీసీసీ పీఠం అప్పగించేందుకు పార్టీ నిర్ణయించడంతో స్క్రూటినీలో కొందరి దరఖాస్తులు ఎగిరిపోనున్నట్లు సీనియర్ నాయకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ సొంత జిల్లా కావడంతో ఈ డీసీసీ పీఠం విషయంలో ఎంపిక ఏవిధంగా ఉంటుందనే విషయమై పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

■ క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణలో భాగంగా ఏఐసీసీ పరిశీలకుడు మంగళవారం బోధన్ నియోజకవర్గంలో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని బ్లాకుల వారీగా సమావేశం నిర్వహించారు. అనంతరం అన్ని మండలాలకు చెందిన సీనియర్ నాయకులు, ఆయా మండలాల అధ్యక్షులతో వ్యక్తిగతంగా మాట్లాడి వివరాలు సేకరించారు. ఒక బీసీ నాయకుడికి, మరొక ఓసీ నాయకుడికి అక్కడి నాయకులు మొదటి, ద్వితీయ ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే పరిశీలకుడు బుధవారం ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు సంబంధించిన సమావేశాలు, అభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఆర్మూర్‌లోని రెండు బ్లాకులకు సంబంధించి నందిపేట మండలం వెల్మల్‌లో, ఆర్మూర్‌లో వరుసగా సమావేశాలు నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం బాల్కొండ నియోజకవర్గంలో బ్లాకుల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. కీలకమైన ఈ సమావేశాల అనంతరం వ్యక్తిగత అభిప్రాయ సేకరణలో ఆయా నాయకులు, సీనియర్ కార్యకర్తలు ఎలాంటి అభిప్రాయాలు చెబుతారనే విషయమై అందరిలో ఉత్కంఠ నెలకొంది.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పాలక వర్గ సభ్యులు

- రూ.3 కోట్లతో కవర్‌షెడ్, టాయిలెట్ల నిర్మాణం
- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్ : నిజామాబాద్ మార్కెట్ యార్డు అభివృద్ధికి మంత్రి, జిల్లా ఎమ్మెల్యేల సహకారంతో అధికారులు, పాలకవర్గం సమష్టిగా కృషి చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గ సాధారణ సమావేశం జరిగింది. చైర్మన్ గంగారెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో కవర్ షెడ్, కూరగాయల మార్కెట్‌లో రెండు టాయిలెట్స్ బ్లాకుల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రూ.97 లక్షలతో గాంధీగంజ్‌లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కూరగాయల మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మార్కెట్‌లో కవర్ షెడ్, సీసీ కెమెరాల పునరుద్ధరణ, నూతనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించాలని పాలకవర్గం తీర్మానించింది. వైస్ చైర్మన్ రాంచందర్ మాట్లాడుతూ చైర్మన్, పాలకవర్గ సభ్యుల మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. సమావేశంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ, గ్రేడ్–1 సెక్రటరీ విజయ్‌కిషోర్, డైరెక్టర్లు మారుతీ మల్లేష్, గంగారెడ్డి, రాజలింగం,బాగారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టండి

- 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' ను సమీక్షించండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అధికారులు

నిజామాబాద్‌అర్బన్ : బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సాంఘిక, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు ఈ వీసీలో పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కింద ఎంపిక చేసిన పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థుల సంక్షేమంపై ఆయా జిల్లాల కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, ఆరోగ్యం, మెనూ ప్రకారం భోజనం, ఇతర మౌలిక వసతుల అమలుపై పాఠశాలలను సందర్శించి పరిశీలించాలన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలని, సమస్యల పరిష్కారంపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యాబోధన కొనసాగేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు రజిత, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగురావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు అంతంతే..!

- సబ్సిడీ వ్యవసాయ పరికరాలపై రైతుల అనాసక్తి
- రెండు నెలల్లో దరఖాస్తు చేసుకుంది 485 మందే..
- అవే ధరలకు బహిరంగ మార్కెట్‌లో లభ్యం..

డొంకేశ్వర్(ఆర్మూర్) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మళ్లీ ప్రారంభించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రైతులు పెద్దగా స్పందించడం లేదు. సబ్సిడీపై అందించే పరికరాలు అవే ధరలకు బహిరంగ మార్కెట్‌లో లభిస్తున్నాయనే కారణంతో దరఖాస్తులు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. తద్వారా గడిచిన రెండు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 485 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఐతే, దరఖాస్తుల సంఖ్యను పెంచడానికి మరింత మంది రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ మంగళవారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో మండలాల ఏవోలను ఆదేశించారు. ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకున్న రైతులతో డీడీలు కట్టించాలని, వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలని ఆయన సూచించారు.

జిల్లాకు 6,742 యూనిట్లు..

ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందుకు జిల్లాకు 6,742 యూనిట్లను కేటాయించి, రూ.5.20 కోట్ల నిధులివ్వగా మొదటి విడతగా రూ.1.67కోట్లు జిల్లాకు మంజూరయ్యాయి. సబ్సిడీపై పవర్ స్ప్రేయర్లు, పిచికారీ యంత్రాలు, రోటవేటర్లు, సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్లర్స్, డిస్క్‌హారో రోటవేటర్స్, బండ్ ఫార్మర్, పవర్ వీడర్స్, బ్రష్ కట్టర్స్, పవర్ టిల్లర్స్, మేజ్ షెల్లర్స్, స్ట్రా బాలర్స్ పరికరాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, మిగతా రైతులకు 40 శాతంపై పరికరాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించగా, జిల్లా వ్యాప్తంగా 500 పై చిలుకు దరఖాస్తులు కూడా రాలేదు. అత్యధికంగా బాన్సువాడ నియోజకవర్గంలో 167, అత్యల్పంగా నిజామాబాద్‌అర్బన్‌లో 8 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. అలాగే మండలాల్లో అత్యధికంగా రెంజల్‌లో 127, అత్యల్పంగా బాల్కొండలో ఒక దరఖాస్తు నమోదైంది. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పరికరాలు బయట మార్కెట్‌లో స్వల్ప తేడాతో లభిస్తుండడంతో రైతులు దరఖాస్తులు చేసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది.


నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులు

ఆర్మూర్	63	నిజామాబాద్‌రూరల్	101
బాల్కొండ	79	నిజామాబాద్‌అర్బన్	08
బోధన్	67	బాన్సువాడ	167

చెక్‌డ్యాం బ్యాక్ వాటర్‌తోనే ముప్పు!

- ఇటీవల గాండ్లపేట్ వద్ద వరద కాలువకు గండి
- ఇంజినీరింగ్ అధికారుల బృందం విచారణ పూర్తి
- మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేస్తున్న అధికారులు





వరద కాలువలో ఏర్పడిన గండి, కిందికి పోతున్న నీరు

మోర్తాడ్(బాల్కొండ) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోని మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి నిర్దేశించిన వరద కాలువకు గండి ఏర్పడిన ఘటనపై ఇంజినీరింగ్ అధికారుల బృందం విచారణ పూర్తి చేసింది. పెద్దవాగు ప్రవాహానికి అడ్డు లేకుండా వరద కాలువ నీటిని మళ్లించడానికి గాండ్లపేట్ వద్ద నిర్మించిన అక్విడెక్టును నిర్మించారు. దీని సమీపంలోనే చెక్‌డ్యాం నిర్మించడం అందులో నీరు నిలచి ఉండటం వల్లనే వరద కాలువకు ముప్పు ఏర్పడటానికి ప్రధాన కారణం అని అధికారులు నిర్ధారించారు. చెక్‌డ్యాం ఇటీవలే కొట్టుకపోయినా ఎంతో కాలం నీరు నిలచి ఉండటం వల్లనే వరద కాలువ కింది భాగంలోని మట్టి కరిగిపోయి ఇప్పుడు ముప్పు వాటిల్లిందని ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. వరద కాలువకు ఇటీవల గండి ఏర్పడి నీరు అంతా పెద్దవాగులో ప్రవహించిన విషయం విదితమే. దీనిపై ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ సుధాకర్ రెడ్డి, సెంట్రల్ డిజైనింగ్ చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ గండిపడిన చోటును పరిశీలించారు. ఎంతో కాలం మనుగాల్సిన వరద కాలువకు గండి ఏర్పడిన అంశం, అందుకు గల కారణాలపై ప్రభుత్వానికి నివేదికను అందించినట్లు తెలిసింది. వరద కాలువ అక్విడెక్టుకు 300ల మీటర్ల దూరంలోనే చెక్‌డ్యాంను నిర్మించడం ఎక్కువ మొత్తంలో నీరు నిలచి ఉండటం వల్లనే గండి ఏర్పడటానికి ప్రధాన కారణం అని అధికారులు గుర్తించారు. కనీసం కిలోమీటర్ దూరంలో చెక్‌డ్యాంను నిర్మించి ఉంటే బ్యాక్ వాటర్ దూరంలోనే ఆగిపోయేదని అధికారులు భావిస్తున్నారు. అక్విడెక్టుకు సమీపంలో చెక్‌డ్యాం నిర్మించడానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోలేదని తెలిసింది. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలోనే చెక్‌డ్యాం నిర్మించినా వరద కాలువను పర్యవేక్షిస్తున్నవారితో సంప్రదింపులు జరుపకపోవడం గమనించాల్సిన విషయం. వరద కాలువ కింది భాగంలోని మట్టి దశలవారిగా కొట్టుకపోయి ఒక్కసారి నీటి ప్రవాహం పెరగడంతో గండి పరిమాణం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇది ఇలా ఉండగా వరద కాలువకు గండి ఏర్పడటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లోని మిగులు జలాలను గోదావరి నదిలోనే వదలాల్సి వస్తుంది. గండిని పూడ్చి ముందు ముందు ఎలాంటి ముప్పు ఏర్పడకుండా ఉండటానికి పకడ్బందీగా మరమ్మత్తులు చేయాల్సి ఉంది. ఇంజినీరింగ్ అధికారులు అంచనాలను రూపొందిస్తున్నారు. సిమెంట్ గోడ కింద మట్టి పూర్తిగా కొట్టుకపోవడం శాశ్వత ప్రాతిపదికన మరమ్మత్తులపై అధ్యాయనం చేయడానికి సాంకేతిక నైపుణ్యంగల అధికారి ఒకరు ఒకటి రెండు రోజుల్లో గండి ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలించనున్నారని తెలుస్తుంది.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..

వరద కాలువకు గండి ఏర్పడిన చోట మరమ్మత్తులు పూర్తి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. గండి ఏర్పడటానికి ప్రధాన కారణం గుర్తించారు. మరమ్మత్తులు చేసి ముందు ముందు ఎలాంటి ముప్పు ఏర్పడకుండా ఉండటానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

క్లుప్తంగా

ఎంఈడీ పరీక్షలకు ఒకరు గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఎంఈడీ 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు మంగళవారం ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఉదయం జరిగిన పరీక్షలకు 29 మంది విద్యార్థులకు గానూ 28 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షల ఫీజును ఈ నెల 25వరకు చెల్లించాలని కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2, 4, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ (2021-2024) పరీక్షల ఫీజును విద్యార్థులు చెల్లించాలన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 27వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

21 నుంచి పోలీసు సంస్మరణ వారోత్సవాలు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 21 నుంచి 31 వరకు పోలీస్ సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీపీ సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. 21న అమరవీరుల దినోత్సవ కార్యక్రమం పోలీస్ ఎడిటర్లు నిర్వహిస్తారన్నారు. 22న అమరవీరుల కుటుంబాలకు పరామర్శ, 23న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 24న బోధన్, ఆర్మూర్ డివిజన్ పరిధిలోని అమరవీరుల కుటుంబాలకు పరామర్శ చేస్తామన్నారు. 25న సైకిల్, బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు.26న వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, ఇందులో కానిస్టేబుల్ నుంచి ఎస్సై స్థాయి వరకు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 27న నిజామాబాద్ డివిజన్‌లో కొన్ని కాలనీలలో సమస్యలను గుర్తించి, పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. 28న ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలోని గ్రామాల్లో సమస్యల గుర్తింపు చేపడతామన్నారు. 29న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. 30న ఆన్‌లైన్ ద్వారా ఓపెన్‌హౌజ్ కార్యక్రమాల నిర్వహణ కొనసాగుతుందన్నారు. 31న క్యాండిల్ ర్యాలీ గాంధీ చౌక్ నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు నిర్వహిస్తామన్నారు.

రేపు అండర్-19 టేబుల్ టెన్నిస్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఈ నెల 16న ఉదయం 11గంటలకు ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో టేబుల్ టెన్నిస్‌కు ఎంపికలు ఉంటాయని డీఐఈవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాలబాలికలు బోనాఫైడ్ తీసుకోని ఎంపికలకు హాజరుకావాలన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా అధికారులు మొక్కజొన్న కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు సూచించారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ నుంచి జూమ్ మీటింగ్‌లో మార్క్‌ఫెడ్ సిబ్బందికి ఈ-పాస్ యంత్రాల వినియోగంపై వారు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన సిబ్బంది సొసైటీ నిర్వాహకులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం దాసోజు మహేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ హాజరు

- జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం
- పని ప్రదేశంలో ఐరిస్ నమోదు

పెర్కిట్(ఆర్మూర్)/కమ్మర్‌పల్లి: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీల హాజరును ఈ-కేవైసీతో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేక యాప్ జాతీయ మస్టర్ పర్యవేక్షణ వ్యవస్థ(ఎన్‌ఎంఎంఎస్)ను తీసుకురాగా, కూలీల వివరాలు, ఈ-కేవైసీ నమోదు చేయడం తప్పనిసరి చేసింది. ఈ విధానంలో కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయడంతోపాటు ఒకరి బదులుగా మరొకరు పనులకు రాకుండా ఐరిస్ నమోదు తప్పనిసరి చేశారు.



చాట్‌పల్లిలో ఉపాధి కూలీకి ఈ-కేవైసీ చేస్తున్న సిబ్బంది

ఈకేవైసీ పూర్తి చేసుకోని కూలీలకు పనులు కల్పించే అవకాశం ఉండదు. ఒకరి జాబ్‌కార్డుపై మరొకరు పని చేసే అవకాశం ఇక ఉండదని అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు ఆస్కారం లేకుండా..

గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో చేపట్టనున్న పనుల వివరాల నమోదుకు ఈ-ఎంబీ (ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్ బుక్) విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. పనిచేసే ప్రాంతాల వివరాలను గుర్తించిన తర్వాత పనులు కొలతలను ఎంబీ రికార్డు చేసిన అనంతరం ఆన్‌లైన్‌లో ఈ-ఎంబీ చేయాల్సి ఉంటుంది. వివరాలను ప్రత్యేక యాప్‌లో అనుసంధానం చేస్తే ఆయా పనులను ఉన్నతాధికారులు ఎక్కడి నుంచయిన పరిశీలించవచ్చు. దీంతో ఒకేచోట రెండు పనులు చేయడం వంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదు. నూతన సంస్కరణలతో పనులు పారదర్శకంగా కొనసాగడంతోపాటు, కూలీలకు కూలి చెల్లింపులు న్యాయంగా జరుగుతాయి.

నకిలీలకు తెర..

గతంలో పని ప్రదేశం వద్ద కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. కానీ కొందరు క్షేత్ర సహాయకులు, మేట్‌లు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. సామాజిక తనిఖీల్లో అక్ర మాలు బయటపడుతుండటంతో వీటిని అరికట్టేందుకు కేంద్రం ఎన్‌ఎంఎంఎస్ యాప్ తీసుకువచ్చింది. ఈ యాప్ కూడా దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించింది. దీంతో నకిలీల హాజరు అరికట్టేందుకు ఈ-కేవైసీ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీని ప్రకారం సెల్‌ఫోన్‌లో ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తారు. నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకే వ్యక్తి రెండు ఫొటోల్లో ఉంటేనే కూలీ డబ్బులు అందుతాయి. జిల్లాలో మొత్తం 2,40,605 లక్షల కూలీలు ఉండగా, ఇప్పటి వరకు 1,27,807 మంది కూలీలకు ఈ-కేవైసీ పూర్తయింది.

ఈ-కేవైసీ పూర్తికి చర్యలు..



ఆర్మూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న కూలీల వివరాలను ఈ-కేవైసీ చేయిస్తున్నాం. ఇప్పటికీ దాదాపు 50 శాతంపైనే ఈకేవైసీ పూర్తి చేశాం. గ్రామాల్లోని ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు నూతన విధానంపై అవగాహన కల్పించాం. నకిలీ మస్టర్లకు తావులేకుండా అర్హులైన కూలీలందరికి వంద రోజుల పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

–సురేష్, ఏపీవో, ఆర్మూర్

వారంలోగా పూర్తి చేస్తాం..



జిల్లాలో కూలీల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. సాధ్యమైనంత త్వరగా నమోదు పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని ఏపీవోలను ఆదేశించాం. ఈ-కేవైసీ విధానానికి కూలీలు పూర్తిగా సహకరించాలి. జిల్లాలో మొత్తం 2,40,605 లక్షల కూలీలు ఉండగా, ఇప్పటివరకు 1,27,807 మంది కూలీలకు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయింది.

–సాయాగౌడ్, పీడీ, డీఆర్డీవో, నిజామాబాద్

మన చేతుల్లోనే ఆరోగ్యం..

- తినేముందు శుభ్రంగా కడుక్కుంటే ఎంతో మేలు
- నేడు గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే



కమ్మర్‌పల్లి: మనం ఏం తిన్నామో కాదు, ఎలా తిన్నామో అనేదే ముఖ్యం. భోజనం తినడానికి ముందు, బాత్‌రూమ్ వెళ్లివచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఎంతో మేలు. ముఖ్యంగా తల్లిదండ్రులు చిన్నారులకు తప్పకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ చేతులు శుభ్రం చేసుకోవడంపై పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. ఏటా అక్టోబరు 15న విశ్వవ్యాప్తంగా చేతుల పరిశుభ్రత దినోత్సవం (గ్లోబల్ హ్యాండ్ వాష్ డే)గా పాటిస్తున్నారు.

శుభ్రంగా లేకుంటే..

మనిషి ఆరోగ్యం శుభ్రతపై ఆధారపడి ఉంటుంది. మురికిగా ఉన్న చేతులతో భోజనం చేస్తే వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి జబ్బులు వస్తాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చాలా పనులు చేస్తుంటాము. ఈక్రమంలో మనం తాకిన ప్రతి వస్తువులపైన కనిపించని క్రిములుంటాయి. ఆయా వస్తువులను తాకినపుడు మన చేతికి అంటుకొంటాయి. చేతుల్లో కంటికి కనిపించని వైరస్‌లు లక్షల్లో దాగిఉంటాయి. అవే చేతులను కళ్లు, నోరు, ముక్కు దగ్గర పెట్టినపుడు బ్యాక్టీరియా, వైరస్ మన శరీరంలోకి చేరుతుంది. చేతులను నీటితో శుభ్రం చేసుకోకుండా ఆహారం తీసుకుంటే చేతుల్లోని క్రిములు నోటిద్వారా శరీరంలోకి చేరుతాయి.

అవగాహన కల్పించాలి..

చేతుల శుభ్రతపై పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం అరచేతుల్లో ఎక్కువ తేమ ఉండటంతోపాటు కొన్ని లక్షల సూక్ష్మజీవులు ఉంటాయి. ఆ చేతులతోనే తినేయడంవల్ల అనేక రోగాల్ని చేతులతో ఆహ్వానించినట్టే. తరచు చేతులు శుభ్రం చేసుకోవడంవల్ల 80 శాతం రోగాలు మన శరీరానికి దూరంగా ఉంటాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొంది. అందుకే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థులకు ఈ విషయాన్ని తెలియజేయాలి. ఆహారం తీసుకునేముందు సబ్బు లేదా యాంటీ బాక్టీరియల్ లోషన్, సానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలి.

నాస్కామ్‌తో తెయూ ఎంవోయూ

తెయూ(డిచ్‌పల్లి): నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్)తో తెలంగాణ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, నాస్కామ్ రీజనల్ హెడ్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) బొజ్జల ప్రవీణ్‌కుమార్ ఒప్పంద అవగాహన పత్రాలను మార్పిడి చేసుకున్నారు. వీసీ మాట్లాడుతూ.. నాస్కామ్ ప్రధానంగా అధ్యాపకులతోపాటు విద్యార్థులు, పరిశోధకులు కెరీర్‌లో ఎదగడానికి ఫ్యూచర్‌స్కిల్స్, డేటా సైన్స్, బిజినెస్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, మెషిన్ లెర్నింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ నిస్తుందన్నారు. తెయూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న అధికారులు

నింగీనేలా ఒక్కటైనట్లు..



రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమంలో మంగళవారం నింగి-నేల ఒక్కటైనట్లు దృశ్యం కనిపించింది. ఆకాశంలోని మేఘాలు నీటిలో ప్రతిబింబిస్తూ పర్యాటకులను ఆకర్షించింది. త్రివేణి సంగమం వద్ద కనుచూపు మేర నీరు, ఆకాశం ఇలా కనిపించడంతో పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

భీమ్‌గల్ ఏటీసీ పనులు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- పలు మండలాల్లో ఆకస్మిక తనిఖీలు

కమ్మర్‌పల్లి(భీమ్‌గల్)/సిరికొండ: భీమ్‌గల్ ఏటీసీ భవనం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్, భీమ్‌గల్ మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలను, నూతనంగా నెలకొల్పిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించి, ఇంకా అవసరం ఉన్న మౌలిక వసతుల గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల రవాణా సౌకర్యం, హాస్టల్ వసతి గురించి కళాశాల ప్రిన్సిపాల్ కోట్టిరెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే సిరికొండ మండలంలోని చీమన్‌పల్లి మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వంట గది, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్ఐ శరత్ తదితరులు ఉన్నారు.



కమ్మర్‌పల్లి ఐటీఐ కళాశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్మీ ట్రెయినింగ్‌కు వెళ్తున్నా.. ఐదేళ్ల తర్వాత వస్తా..

- అమ్మానాన్న, అక్క బాధపడకండి..
- బోధన్‌లో అదృశ్యమైన విద్యార్థి రాసిన లేఖ లభ్యం

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని విజేత జూనియర్ కళాశాలలో ఎంపీసీ ఫస్టియర్ విద్యార్థి సోమవారం అదృశ్యమైన విషయం తెలిసిందే. ఈక్రమంలో సదరు విద్యార్థి అమ్మానాన్నలకు రాసిన లేఖ మంగళవారం వెలుగులోకి వచ్చింది. లేఖలోని సమాచారం ఇలా.. అమ్మానాన్న దయచేసి నన్ను క్షమించండి. నాకు కాలేజీ నచ్చడం లేదు. నేను ఆర్మీ ట్రెయినింగ్‌కు వెళుతున్నాను. నన్ను వెతకకండి. అక్కడ నేను సంతోషంగా ఉంటాను. అమ్మ, నాన్న, అక్క బాధపడకండి. ఐదేళ్ల తర్వాత మళ్లీ వస్తాను. అరేయ్ రామ్‌చరణ్ ఈ లేటర్ సార్ వాళ్లకు ఇవ్వకు, అమ్మకు, లేదా నాన్నకు మాత్రమే ఇవ్వు ప్లీస్. అంటూ విద్యార్థి రాసిన లేఖ లభ్యమైంది.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య



పిట్లం(జుక్కల్): ఓ వివాహిత మంజీర నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా..బాన్సువాడ డివిజన్ తాడ్కోలు గ్రామానికి చెందిన చిన్న నాగమణి (52) గత మూడేళ్లుగా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. చికిత్స చేయించినప్పటికీ వ్యాధి తగ్గకపోవడంతో జీవితం మీద విరక్తిచెందింది. ఈక్రమంలో సోమవారం రాత్రి ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చి బొల్లపల్లి గ్రామ శివారులోని మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు.

నగరంలో ఒకరు..

నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని గాయత్రి నగర్‌కు చెందిన మోత్కూరి కిషోర్ కుమార్(39) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా కుటుంబంలో కలహాలు రావడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో మంగళవారం క్షణికావేశంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నాలుగో టౌన్ పోలీసులు తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ వద్ద సోమవారం పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో అడవి మామిడిపల్లికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు మంగళవారం అతడిని కోర్టుకు తరలించగా, జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్షవిధించినట్టు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

నగరంలో ఒకరికి..

నిజామాబాద్ అర్బన్: నగరంలోని వర్ని చౌరస్తా వద్ద పోలీసులు ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. మంగళవారం అతడిని కోర్టులో హాజరుపర్చగా, జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఏడు రోజులు..

నగరంలోని సీతారాంనగర్‌కాలనీకి చెందిన సుధాకర్ సోమవారం రాత్రి కాలనీలో న్యూసెన్స్ చేయడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. మంగళవారం అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు 5వ టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు.

భార్యను హతమార్చిన భర్త

- వివాహేతర సంబంధం అంటూ ఘాతుకానికి పాల్పడిన వైనం
- నిందితుడి అరెస్టు



మమత (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భార్యను భర్త హత్య చేసిన ఘటన ఆర్మూర్‌లో వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన జగదీష్ గత 40 సంవత్సరాల క్రితం బతుకు దెరువు కోసం ఆర్మూర్‌కు వలస వచ్చాడు. కొన్నేళ్ల క్రితం మెదక్ జిల్లాకు చెందిన మమతను వివాహం చేసుకొని మామిడిపల్లి నివసిస్తున్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. జగదీష్ ఒక సామిల్‌లో పనిచేస్తుండగా, మమత నిజామాబాద్‌లో గణపతి విగ్రహాలకు మెరుగులు దిద్దే పనిచేస్తుంది. కాగ మమత మామిడిపల్లికి చెందిన ఒక వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయం తెలిసిన భర్త పలుమార్లు వారించాడు. ఈ విషయమై మంగళవారం వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా దంపతులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అనంతరం పనికి వెళ్లిన జగదీష్ ఇంటికి వచ్చేసరికి భార్య, ప్రియుడు కలిసి ఉండటాన్ని చూసి తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. విచక్షణ కోల్పోయి, వంట గదిలో ఉన్న కత్తితో భార్య గొంతును కోసి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటన స్థలాన్ని ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్, ఎస్సైలు రమేష్, వినయ్ సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని సుభాష్ నగర్‌లో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు మంగళవారం తెలిపారు. పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.17,250 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు బైకులు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన తెయూ వీసీ వాహనం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వైస్-చాన్స్‌లర్ అధికారిక వాహనం మంగళవారం డిచ్‌పల్లి-నిజామాబాద్ బైపాస్ రోడ్డుపై అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటన సమయంలో వాహనంలో డ్రైవర్ మాత్రమే ఉండటంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ వాహనాన్ని నడుపుకుంటూ నిజామాబాద్ నుంచి క్యాంపస్‌కు బయలుదేరాడు. బైపాస్ రోడ్డులోని వెలమ సంఘం సమీపంలోకి రాగా నిద్రమత్తుతో డ్రైవర్ కళ్లు మూసుకుపోయాయి. దీంతో వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దిగి పొలాల్లోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. స్థానికులు డ్రైవర్‌ను వాహనం నుంచి క్షేమంగా బయటకుతీసి, తెయూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్ సాయంతో వాహనాన్ని బయటకు తీసి క్యాంపస్‌కు చేర్చారు.

స్కూల్ బస్సు కిందపడి బాలుడి మృతి

కమ్మర్‌పల్లి(భీమ్‌గల్): స్కూల్ బస్సు కింద పడి బాలుడు మృతిచెందిన ఘటన భీమ్‌గల్ మండలం రహత్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా.. భీమ్‌గల్‌లోని కృష్ణవేణి హైస్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులను తీసుకెళ్లేందుకు రహత్‌నగర్ గ్రామానికి మంగళవారం ఉదయం వెళ్లింది. ఈ సమయంలో శిరీష అనే మహిళ తన పెద్ద కొడుకును స్కూల్‌కు పంపడం కోసం బస్సు ఎక్కించింది. తల్లి వెంటే వచ్చిన చిన్న కొడుకు శ్రీకాంత్(3) బస్సు ముందుకు వెళ్లి ఆడుకుంటుండగా, విషయాన్ని గమనించని డ్రైవర్ మధు బస్సును ముందుకు నడపడంతో బాలుడిని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన శ్రీకాంత్‌ను కుటుంబీకులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి ఒకరు గల్లంతు



గణేశ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: చేపలు పట్టడానికి చెరువుకు వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతైన ఘటన ఎల్లారెడ్డిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతానికి చెందిన రుడావత్ గణేశ్ (48) మంగళవారం పట్టణ శివారులోని పెద్ద చెరువులో చేపలు పట్టడానికి ఇంటి నుంచి బయలుదేరాడు. చెరువులోకి దిగిన అతడు ప్రమాదవశాత్తూ నీళ్లలో మునిగిపోయాడు. అతడి మృతదేహం కోసం పోలీసులు ప్రయత్నించినా చీకటి పడటంతో సాధ్య పడలేదు. మృతదేహం కోసం బుధవారం ఉదయం గాలింపులు చేపడతామని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కొడుకు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

కాలువలో నీటమునిగి ఒకరు..



భానుప్రసాద్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): కాలకృత్యాలు తీర్చుకునేందుకు నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి వెళ్లిన ఓ వ్యక్తి నీటమునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల భానుప్రసాద్ (22) సోమవారం సాయంత్రం తుంకిపల్లి గ్రామం నుంచి మహమ్మద్ నగర్ గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. బూర్గుల్ గ్రామ శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట వద్ద బహిర్భూమి కోసం వెళ్లాడు. అనంతరం కాలువలో కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. కాలువలో గాలింపు చేపట్టగా మంగళవారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

మోపాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన బనావత్ సీత(59) ఈనెల 10న సాయంత్రం గ్రామ కమాన్ మలుపు వద్ద నడుచుకుంటూ వెళ్తోంది. అదేసమయంలో గాంధారి మండలం తిమ్మాపూర్‌కు చెందిన పోతరాజు సంగమేశ్వర్ బైక్‌తో ఆమెను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. మృతురాలి కోడలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సుస్మిత తెలిపారు.

కూతురిపై అత్యాచారం చేసిన నిందితుడికి ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం/బాన్సువాడ: కన్న కూతురుపై అత్యాచారం చేసిన తండ్రికి కామారెడ్డి కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలు ఇలా.. బాన్సువాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని ఈ ఏడాది సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వెళ్లింది. తిరిగి పాఠశాల ప్రారంభం అయ్యాక మూడు రోజులు ఆలస్యంగా వచ్చింది. ఈవిషయమై విద్యార్థినిని హెచ్‌ఎం విజయభారతి ఆరా తీశారు. సెలవుల్లో ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న సమయంలో తనపై తండ్రి లైంగిక దాడికి పాల్పడినట్లు విద్యార్థిని చెప్పడంతో హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని కోణాల్లో విచారణ జరిపిన పోలీసులు కన్న కూతుతుపై అత్యాచారానికి పాల్పడిన తండ్రిపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ మంగళవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏపీపీ శేషు, బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, లైజనింగ్ అధికారి రామేశ్వర్ రెడ్డి, పీసీ సాయిలులను ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. ఈ కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఏడాది లోపే తీర్పు వచ్చిందని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని గుడిపాటి చంద్రశేఖరశర్మ ఇటీవల తన ఇంటికి తాళం వేసి, భార్యతో కలిసి ఊరికి వెళ్లాడు. మంగళవారం వారి బంధువులు చంద్రశేఖరశర్మ ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండటంతో శర్మకు ఫోన్‌లో సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చిచూడగా ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 8తులాల బంగారం ఆభరణాలు, 11 తులాల వెండి ఆభరణాలు. 11 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చైనా మంజా స్వాధీనం

నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఆజామ్‌రోడ్డులో నిషేధిత చైనా మంజాను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై సయ్యద్‌ముజాహిద్ మంగళవారం తెలిపారు. రతన్, వినోద్, జహీరొద్దీన్ ఫరుకీ అనే వ్యక్తులు కారులో రూ. 15,750 విలువచేసే చైనా మాంజాను మంగళవారం నగరానికి తీసుకవచ్చి విక్రయించేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని పట్టుకొని కేసు నమోదు చేశారు.



శ్రీలంక-న్యూజిలాండ్ మ్యాచ్ వర్షార్పణం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచకప్‌లో మరో పోరు వర్షార్పణమైంది. కొలంబోలో నిరంతరాయంగా కురుస్తున్న వానలతో రెండోసారి శ్రీలంక ఖాతాలో ఫలితం తేలని మ్యాచ్ చేరింది. మంగళవారం న్యూజిలాండ్, శ్రీలంక మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌ను ఒక ఇన్నింగ్స్ తర్వాత భారీ వర్షం కారణంగా రద్దు చేయాల్సి వచ్చింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. నీలాక్షిక సిల్వ (28 బంతుల్లో 55 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), చమరి అటపట్టు (72 బంతుల్లో 53; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... హాసిని పెరీరా (44),విష్మి గుణరత్నే (42) రాణించారు. కివీస్ బౌలర్లలో సోఫీ డివైన్ 3, బ్రీ ఇల్లింగ్ 2 వికెట్లు పడగొట్టారు. అయితే లంక బ్యాటింగ్ ముగిసిన తర్వాత మొదలైన వర్షం ఆ తర్వాత కొంచెం కూడా తెరిపిని వ్వలేదు. దాంతో న్యూజిలాండ్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 4న కొలంబోలోనే శ్రీలంక, ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. కొలంబోలోనే నేడు జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ ఆడుతుంది.

‘ప్రపంచకప్ టోర్నీకి చాలా సమయం ఉంది’



- రోహిత్, కోహ్లి భవిష్యత్తుపై గంభీర్ వ్యాఖ్య
- రాబోయే సిరీస్‌పైనే దృష్టి పెట్టామన్న హెడ్ కోచ్


న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. సిరీస్ ఫలితంకంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ ఈ సిరీస్‌తోనే బరిలోకి దిగుతున్న వీరిద్దరు ఇప్పటికే రెండు ఫార్మాట్‌ల నుంచి రిటైర్ అయి ఒక్క వన్డేలే ఆడుతున్నారు. ఈ క్రమంలో రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి కూడా తప్పించారు. ఈనేపథ్యంలో తాజా చర్చపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇప్పటికిప్పుడు వారిద్దరి భవిష్యత్తుపై తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. ‘వన్డే వరల్డ్‌కప్‌కు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి భవిష్యత్తుకంటే ప్రస్తుతంపైనే దృష్టి పెట్టడం ముఖ్యమని నేను భావిస్తా. వారిద్దరు అత్యుత్తమ ఆటగాళ్లు అనడంలో సందేహం లేదు. పునరాగమనం చేస్తున్న వారి అనుభవం ఆస్ట్రేలియాలో పనికొస్తుంది. వీరిద్దరు బాగా ఆడి సిరీస్ విజయంలో భాగమవుతారని ఆశిస్తున్నా’ అని గంభీర్ చెప్పాడు.

గిల్‌కు కెప్టెన్సీ అర్హత ఉంది...

భారత టెస్టు కెప్టెన్సీతో పాటు వన్డేలకు కూడా సారథ్యం వహించే సత్తా, అర్హత శుబ్‌మన్ గిల్‌కు ఉన్నాయని, ఈ హక్కును అతను సాధించుకున్నాడని గంభీర్ ప్రశంసించాడు. ‘కెప్టెన్‌గా గిల్‌ను నియమించి ఎవరూ ఔదార్యం చూపించలేదు. అతడికి ఆ అర్హత ఉంది. కోచ్‌గా కూడా నేను ఈ మాట చెప్పగలను. ప్రపంచ క్రికెట్‌లో అతి కఠినమైన పర్యటనల్లో ఇంగ్లండ్ ఒకటి. అలాంటి చోట ఐదు టెస్టులూ గట్టిగా నిలబడి సిరీస్‌ను సమం చేసుకోగలగడం చిన్న విషయం కాదు. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాటు జట్టును సమర్థంగా నడిపి వన్డేల్లోనూ సారథి కాగల హక్కును అతను సాధించాడు’ అని గంభీర్ అన్నాడు. 2027 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఇప్పుడే మాట్లాడటం అనవసరమని, వరుసగా విజయాలు సాధించడమే తమ లక్ష్యమని అతను స్పష్టం చేశాడు. భారత జట్టు నవంబర్ 9న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడనుండగా... నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు జరుగుతుంది. అయితే ప్రొఫెషనల్ క్రికెటర్లు తక్కువ సమయంలో పరిస్థితులకు తగినట్లుగా మార్చుకోగలరని విశ్వాసం వ్యక్తం చేసిన గంభీర్... టెస్టు టీమ్‌లో మాత్రమే సభ్యులైన ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ గెలవడం పట్ల కోచ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే భారత్‌లో కూడా పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే విధంగా బౌన్సీ పిచ్‌లు ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

హర్షిత్ రాణాపై అనవసర విమర్శలు...

భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్‌లలోనూ వరుసగా అవకాశాలు పొందుతున్న పేస్ బౌలర్ హర్షిత్ రాణాపై ఇటీవల సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతిభావంతుడు కాకపోయినా... ఢిల్లీకి చెందినవాడు కావడంతో పాటు గంభీర్ ఐపీఎల్ టీమ్ కేకేఆర్‌కు మెంటార్‌గా ఉన్న సమయంలో సాన్నిహిత్యం వల్లే రాణాకు జట్టులో చోటు దక్కుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇటీవల ఇదే మాట అన్నాడు. తాజా విమర్శలపై గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఈ వివాదంలో హర్షిత్‌కు అతను పూర్తి మద్దతు పలికాడు. ‘యూట్యూబ్‌లో వ్యూస్ కోసం కొందరు ఒక 23 ఏళ్ల యువ ఆటగాడిని లక్ష్యంగా చేసుకున్నందుకు సిగ్గుపడాలి. రాణా తండ్రి మాజీ క్రికెటర్ కాదు. సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ కానీ ఎన్‌ఆర్‌ఐ కానీ కాదు. అతను తన ప్రతిభను నమ్ముకొనే క్రికెట్ ఆడుతున్నాడు. ఒక ఆటగాడి ప్రదర్శన బాగా లేకుండా విమర్శించవచ్చు కానీ ఇలా వ్యక్తిగత విమర్శలు చేస్తారా. కావాలంటే నన్ను విమర్శించండి. నేను దానిని భరించగలను. కానీ 23 ఏళ్ల ఆటగాడిపై ఇది మానసికంగా ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఆలోచించారా. భారత క్రికెట్ జట్టు ఎవరిదో సొంత ఆస్తి కాదు. మన జట్టు గెలవాలని భావించే అందరిది ఈ జట్టు అని మర్చిపోవద్దు’ అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



లాంఛనం ముగిసింది

రెండో టెస్టులో 7 వికెట్లతో భారత్ జయభేరి

వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ ● కేఎల్ రాహుల్ అర్ధశతకం

న్యూఢిల్లీ: వెస్టిండీస్ మూడో **రోజు ఫాలోఆన్‌లో** రెండో ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టిన **పోరాటం** నాలుగో రోజూ కొనసాగడం... **ఇద్దరి సెంచరీల** మైలురాయితో ఆతిథ్య భారత్ **ముందు లక్ష్యాన్ని** ఉంచడంతో ఈ చివరి టెస్టు **చివరి రోజుదాకా** సాగింది. మంగళవారం ఆటలో **భారత్ సులువైన** లక్ష్య ఛేదనలో మిగిలిపోయిన **లాంఛనాన్ని తొలి** సెషన్‌లోనే పూర్తి చేసింది. అలా **రెండో టెస్టులో** టీమిండియా 7 వికెట్ల తేడాతో **వెస్టిండీస్‌పై ఘనవి**జయం సాధించింది. భారత్ **రెండో ఇన్నింగ్స్‌లో** 35.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి **124 పరుగులు చేసి** గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్ కేఎల్ **రాహుల్ (108** బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, **2 సిక్స్‌లు) అర్ధ**శతకం సాధించాడు. రోస్టన్ చేజ్ **2 వికెట్లు తీయగా...** వారికెన్‌కు ఒక వికెట్ దక్కింది. **రవీంద్ర జడేజాకు** ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ లభించింది. **రెండు టెస్టుల్లో** ఆడిన ఒకే ఇన్నింగ్స్‌తో శతక్కొట్టిన **జడేజా 8 వికెట్లు** కూడా తీశాడు. కాగా ఈ రెండో **టెస్టులో 8 వికెట్లు** (5/82, 3/104) పడగొట్టిన **కుల్దీప్ యాదవ్‌కు** ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది.

గంటసేపు పైగా...

ఆఖరి రోజు మిగిలిపోయిన 58 పరుగులు చేసేందుకు 63/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ కాసేపటికే సాయి సుదర్శన్ (76 బంతుల్లో 39; 5 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్‌కు జతయిన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (13) కూడా వికెట్‌ను సమర్పించుకోవడంతో లాంఛనం పూర్తి చేసేందుకు భారత్ గంటసేపు పైగానే ఆడాల్సి వచ్చింది. క్రీజులోకి ధ్రువ్ జురేల్ (6 నాటౌట్; 1 ఫోర్) రాగా... 102 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ అజేయంగా నిలిచి భారత్‌ను గెలిపించాడు. కేఎల్ రాహుల్ తొలి **టెస్టులో శతకంతో కదంతొక్కాడు. ఈ క్లీన్‌స్వీప్** విజయంతో టీమిండియా ‘ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్’ పాయింట్ల పట్టికలో 61.9 శాతంతో మూడో స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; **వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** 248; **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** 390; **భారత్ రెండో** ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ **(సి) ఫిలిప్ (బి)** వారికెన్ 8; రాహుల్ (నాటౌట్) **58; సాయి సుదర్శన్** (సి) షై హోప్ (బి) చేజ్ 39; గిల్ (సి) గ్రీవెస్ (బి) చేజ్ 13; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం** (35.2 ఓవర్లలో 3 వికెట్లకు) 124. **వికెట్ల పతనం:** 1-9, 2-88, 3-108. **బౌలింగ్:** సీల్స్ 3-0-14-0, వారికెన్ 15.2-4-39-1, పియర్ 8-0-35-0, చేజ్ 9-2-36-2.

10 వెస్టిండీస్‌పై భారత్ వరుస సిరీస్ విజయాల సంఖ్య. దక్షిణాఫ్రికా పేరిట ఉన్న ఒకే జట్టుపై వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ సమం చేసింది. దక్షిణాఫ్రికా జట్టు కూడా విండీస్‌పై వరుసగా పది సిరీస్‌లలో గెలిచింది.

14 ఢిల్లీ గడ్డపై టీమిండియా అజేయ రికార్డు. భారత్ 1993 నుంచి ఇక్కడ ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా ఓడలేదు. 12 టెస్టులు గెలువగా, రెండు ‘డ్రా’ అయ్యాయి.

122 సొంతగడ్డపై భారత్ గెలిచిన టెస్టులు. సంప్రదాయ క్రికెట్ చరిత్రలోనే ఇది మూడో అత్యధికం. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) మాత్రమే ముందున్నాయి.

భారత్-పాకిస్తాన్ హాకీ మ్యాచ్ ‘డ్రా’



జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి ‘డ్రా’ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మంగళవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 3-3 గోల్స్‌తో ‘డ్రా’గా ముగించింది. భారత్ తరఫున అరిజిత్ సింగ్ (43వ నిమిషంలో), ఆనంద్ (47వ నిమిషంలో), మన్‌మీత్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున హన్నాన్ షాహిద్ (5వ నిమిషంలో) ఒక గోల్.. సుఫియాన్ ఖాన్ (39వ, 55వ నిమిషంలో) రెండు గోల్స్ చేశాడు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

ఆసియా కప్ ఆశలు గల్లంతు

సింగపూర్ చేతిలో ఓడిన భారత్

మార్గావ్: ఆసియా కప్-2027 ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించడంలో భారత్ విఫలమైంది. క్వాలిఫికేషన్ టోర్నీలో రెండో పరాజయంతో జట్టు నిష్క్రమణ ఖాయమైంది. మంగళవారం జరిగిన గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో సింగపూర్ 2-1 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. సింగపూర్ తరఫున సంగ్ యు యంగ్ 44వ, 58వ నిమిషాల్లో గోల్స్ నమోదు చేశాడు. భారత్ తరఫున లాలియన్‌జువల చాంగ్తే 14వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. గ్రూప్ ‘సి’లో టీమిండియా చివరి స్థానంలో ఉంది. గ్రూప్ విజేత మాత్రమే ఆసియా కప్‌కు అర్హత సాధిస్తుంది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అందుకు తెగించే ఇక్కడ ఉన్నాను

- సిద్ధు జొన్నలగడ్డ



“నేను ఏ సినిమా చేసినా నాపై నాకే ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడే డీటీఎస్‌లో ‘తెలుసు కదా’ సినిమా చూశాను. చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇదే ఎగ్జైట్ మెంట్‌ని ఆడియన్స్ కూడా ఫీలవుతారని అనుకుంటున్నా’’ అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం ‘తెలుసు కదా’. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ చెప్పిన విశేషాలు.

● ‘తెలుసు కదా’లో నేను వరుణ్ పాత్రలో కనిపిస్తాను. స్క్రీన్‌పై వరుణ్ మామూలుగా కనిపిస్తున్నప్పటికీ అతని ఆలోచనలు చాలా ర్యాడికల్‌గా ఉంటాయి. ఈ క్యారెక్టరైజేషన్ చూసి, ఆడియన్స్ షాక్ అవుతారనుకుంటున్నాను. ఫస్టాఫ్‌లో శ్రీనిధి, సెకండాఫ్‌లో రాశీ క్యారెక్టర్స్ బలంగా కనిపిస్తాయి. వీరిద్దరి కంటే వరుణ్ రోల్ ఇంకా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ● కొత్తవాళ్లతో వర్క్ చేయడం రిస్క్‌తో కూడుకున్న పనే. కానీ రిస్క్ ఉన్న చోటే రివార్డు కూడా ఉంటుంది. నీరజగారి ఐడియాలు బాగున్నాయి. కాకపోతే హీరో క్యారెక్టరైజేషన్‌ను కాస్త ఇంప్రూవ్ చేసిన తర్వాత షూటింగ్‌కు వెళ్లాం. డబ్బుల గురించి ఆలోచించకుండా మంచి సినిమా తీయమని ప్రోత్సహించే నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు. అందుకే విజువల్‌గా ‘తెలుసు కదా’ స్క్రీన్‌పై పెద్ద సినిమాలా కనిపిస్తుంది. ● సినిమా మేకింగ్‌లో జోక్యం చేసుకుంటున్నానంటే నా కోసం ఎవరూ కథలు రాయలేదు. నా కథలు నేనే రాసుకున్నాను. ఫిల్మ్ మేకింగ్ గురించిన ప్రతి విషయాన్ని నేర్చుకున్నాను. ఒకవేళ సినిమా హిట్టయితే డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, హీరో హీరోయిన్ల యాక్టింగ్... ఇలా అన్నీ బాగున్నాయి అంటారు. అదే ఫ్లాప్ అయితే నేను ఇన్వాల్వ్ అయ్యాను కాబట్టి పోయిందని నిందిస్తారు. ఇందుకు తెగించే ఇక్కడ ఉన్నాను. ● నేను హీరోగా నటించిన ‘డీజే టిల్లు, డీజే టిల్లు 2’ సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఈ డీజే టిల్లు క్యారెక్టరైజేషన్ ‘హై’ వల్ల నా సినిమాలు ఒకట్రెండు ఫలితాలు తారుమారు కావొచ్చని ముందే ఊహించాను. ‘జాక్’ సినిమా ఆడియన్స్‌ను మెప్పించలేకపోయింది. అప్పుడు కొరటాల శివగారు ఫోన్ చేసి, ‘డీజే టిల్లు’ హిట్స్‌తో ఆల్ టైమ్ ‘హై’ చూశావ్... ‘జాక్’తో ‘లో’ చూశావ్. ఇక నువ్వేం చేసినా ఆ రెండింటి మధ్య చూస్తావు’’ అన్నారు. ఆ మాటలు నాలో కొత్త ఆలోచనలు కలిగించాయి. ● ఇటీవల ఓ ఇబ్బందికర ప్రశ్న ఎదుర్కొన్నాను. సినిమాల్లో హీరో పోలీసాఫీసర్ అయితే రియల్‌గానూ పోలీస్‌గా ఉంటారా? హీరో డ్రగ్ ఎడిక్ట్ అయితే రియల్ లైఫ్‌లోనూ డ్రగ్ ఎడిక్టై ఉంటారా? అది సినిమా. హీరో ఆన్సర్ చేసే పొజిషన్‌లో ఉన్నాడు కదా అని ఏది పడితే అది అడిగేయడం కరెక్ట్ కాదు. ● ‘తెలుసు కదా’ ప్రమోషన్స్‌లో భాగంగా రవితేజగారి బయోపిక్ చేయాలని ఉందని చెప్పాను... చూడాలి. ఇక నాకు డైరెక్టర్‌గా మారే ఆలోచన కూడా ఉంది. హీరోగా నా తర్వాతి సినిమా ‘బ్యాడాస్’ కొత్తగా ఉంటుంది. మల్లిక్ రామ్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది.

ఫ్లాష్‌బ్యాక్‌లో యాక్షన్



● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఎన్టీఆర్ నీల్’ (వర్కింగ్ టైటిల్). ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కోసం ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లోకి మారారని టాక్. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా నిలవనున్నాయట. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి ‘డ్రాగన్’ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

‘వార్ 2’ రికార్డ్ : హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ముఖ్య తారలుగా నటించిన చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదలైంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ నెల 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అత్యధిక మంది వీక్షించిన చిత్రాల జాబితాలో ‘వార్ 2’ చిత్రం టాప్‌లో ఉన్నట్లు ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ తెలిపింది. ఈ నెల 6 నుంచి 12 వరకూ 3.5 మిలియన్ల మంది వీక్షించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో గత వారం ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా ‘వార్ 2’ నిలిచింది.

కుందేలుకి కోపం వస్తే..!



● చిరంజీవి, నయనతార

‘‘మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... పొద్దునలేచిన దగ్గర్నుంచి డైలీ యుద్ధాలా... మొగుడు పెళ్లాలంటే కంకీ కొడవల్లా... అట్ట కన్నెర చెయ్యాలా... కారాలే నూరేలా...’’ అంటూ సాగుతుంది ‘మీసాల పిల్లా...’ పాట. చిరంజీవి హీరోగా నటిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమాలోనిది ఈ పాట. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో చిరంజీవి, నయనతార భార్యా భర్తలుగా కనిపిస్తారు. ఈ సినిమాలోని ‘మీసాల పిల్లా...’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా ఉదిత్ నారాయణ్ ఆలపించారు. ‘‘ఇట్ట దుమ్మెత్తి పొయ్యాలా దూరాలె పెంచేలా... కుందేలుకి కోపం వస్తే చిరుతకు చెమటలు పట్టేలా...’ అంటూ ఈ పాట సాగుతుంది. అర్చన సమర్పణలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

కబడ్డి... కబడ్డి



● ధృవ్

ప్రముఖ తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బైసన్’. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌పై సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితీ ఆనంద్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 17న విడుదల కానుంది. తెలుగులో జగదాంబే ఫిలిమ్స్ పై బాలాజీ ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రానా రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ– ‘‘1990 బ్యాక్‌డ్రాప్‌లో కబడ్డీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘బైసన్’. ట్రైలర్ ఎంత ఆసక్తికరంగా ఉందో సినిమా కూడా థ్రిల్లింగ్ అంశాలతో అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ దక్కుతుంది. కబడ్డీ నేపథ్యంలో రాబోతున్న మా సినిమా కూడా మంచి విజయం అందుకుంటుందని నమ్ముతున్నాను’’ అన్నారు.

అరి కథతో పుస్తకం తీసుకొస్తున్నాం

- జయశంకర్



● వినోద్ వర్మ, జయశంకర్

‘‘అరిషడ్వర్గాల గురించి ఎంతోమంది గొప్పవాళ్లు చెబుతూ వచ్చారు. కానీ, వాటికి పరిష్కారం చూపించలేదు. ఈ ఆలోచనతోనే ‘అరి’ చిత్రాన్ని రూపొందించాను. ఈ సినిమా కథతో త్వరలోనే పుస్తకాన్ని తీసుకొస్తున్నాం’’ అని దర్శకుడు జయశంకర్ చెప్పారు. వినోద్ వర్మ, అనసూయ, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘అరి’. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు. ఏషియన్-సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో జయశంకర్ మాట్లాడుతూ– ‘‘మా సినిమాకి స్లోగా ఓపెనింగ్స్ వచ్చి పికప్ అవుతుందనుకున్నాం. అయితే శ్రీకాంత్ అయ్యంగార్ ఇష్యూ వల్ల రెండో రోజునే మా సినిమా పోస్టర్స్‌ను థియేటర్స్ దగ్గర చించివేయడం బాధగా అనిపించింది. ఆ తర్వాత ఆ వివాదం సద్దుమణిగింది. మూడో రోజు నుంచి మా సినిమాకి ప్రేక్షకుల సందడి కనిపించింది’’ అని పేర్కొన్నారు. ‘‘పేపర్ బాయ్’లో అవకాశం ఇచ్చి, నాకు గుర్తింపు తీసుకొచ్చిన జయశంకర్‌గారు ఇప్పుడు ‘అరి’లో లీడ్ రోల్ ఇచ్చి మరింత గుర్తింపు తెచ్చుకునేలా చేసినందుకు థ్యాంక్స్’’ అని నటుడు వినోద్ వర్మ తెలిపారు.

ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు

- నిర్మాత రాజేశ్ దండ

‘‘నిర్మాతగా ‘కె-ర్యాంప్’ నాకు ఆరవ సినిమా. నా గత ఐదు చిత్రాల్లో ఎక్కడా ఇబ్బందికరమైన పదాలు లేవు. ఒక్కో సినిమా కథ ఒక్కోలా ఉంటుంది. అంతే కానీ కావాలని కొన్ని పదాలు పెట్టి, ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించాలని అనుకోను. అలాంటి సినిమాలు నేను తీయను. ‘కె-ర్యాంప్’ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు’’ అని చెప్పారు నిర్మాత రాజేశ్ దండ. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘కె-ర్యాంప్’. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజేశ్ దండ మాట్లాడుతూ– ‘‘ఈ చిత్రంలో కిరణ్‌గారు కుమార్ అబ్బవరం అనే పాత్రలో నటించారు. ఈ సినిమా కథ విని ఎగ్జైట్ అయ్యాను. మా సినిమాకు సెన్సార్ వాళ్ళు ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చింది ఇందులో ఇబ్బందికరమైన పదాలు ఉన్నాయని కాదు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వీటిని చూసి ఎవరైనా ఆడియన్స్ ప్రేరణ పొందుతారేమోనని ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చారు... అంతే. వల్గారిటీ లేదు. ఇక ‘కె-ర్యాంప్’ సినిమా కిరణ్‌గారి వన్ మ్యాన్ షోలా ఉంటుంది. ఇంట్రవెల్ బ్యాంగ్ బ్లాస్ట్ అవుతుంది. ఈ సినిమాతో నిర్మాత శివతో నాకు మంచి ప్రయాణం మొదలైంది. నా మీద నమ్మకంతో కథ వినకుండానే ఈ సినిమాలో భాగమయ్యారు శివ. ప్రస్తుతం మా బ్యానర్‌లో హీరోయిన్ సంయుక్తతో ఓ సినిమా చేస్తున్నాం. అలాగే ‘అల్లరి’ నరేశ్‌గారితో ఓ సినిమా ఉంది’’ అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘టార్గెటెడ్ ట్రోలింగ్ గురించి బన్నీ వాసుగారు మాట్లాడిన విషయాలను నేను ఫాలో కాలేదు. పూర్తి విషయాలు తెలిసిన తర్వాత స్పందిస్తాను’’ అని చెప్పారు. ‘‘కిరణ్‌గారిని ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది’’ అన్నారు శివ బొమ్మకు.



● రాజేశ్ దండ, శివ బొమ్మకు

సస్పెన్స్ సీమంతం



● సుధాకర్, ఆర్పీ పట్నాయక్

‘‘ప్రస్తుతం సమాజంలో నెలకొన్న ఓ ప్రధానమైన సమస్య నేపథ్యంలో రూపొందిన ‘సీమంతం’ సినిమా మంచి విజయం సాధించాలి. ‘ఎద మాటున...’ పాట బాగుంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తెలిపారు. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వం వహించిన చిత్రం ‘సీమంతం’. ప్రశాంత్ టాటా నిర్మించిన ఈ సినిమా నవంబరు 14న విడుదల కానుంది. ఎస్. సుహాస్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘ఎద మాటున...’ అంటూ సాగే పాటని ఆర్పీ పట్నాయక్ రిలీజ్ చేశారు. ‘‘సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘సీమంతం’. గర్భవతులపై దాడుల నేపథ్యంలో కథ సాగుతుంది’’ అని యూనిట్ పేర్కొంది.